# మేము చూస్తాం

కొచ్చర్లకోట వెంకటసుబ్బారావు

కళ్లున్న ప్రతి వాడూ చేసే మొదటి పని ఆఖరి పని చూడటమే. విశాలమైన దేహంలో యిప్పుడొస్తున్నపది పైసల నాణాల్లాంటి రెండు చిన్న కళ్లు ఉంది అందుకే. చూడటం అనే ప్రక్రియ పరమ ఆవశ్యకమయింది కాబట్టే. 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు. ఏ మాత్రం ప్రయత్నం, అలసట లేకుండా మొండి సోమరి కూడా చేయగలిగిన అతి సునాయాసమయిన పని యిదే.

చూడటమనేది పబ్లిక్ ఎఫైర్ 'నా యిష్టం నేను చూస్తాను' అంటూ చెడామడా ఎక్కడ పడితే అక్కడ చూస్తే మన పునాధులు కదిలిపోవచ్చు. మనషుల్లో ఎన్ని రకాలో, చూపుల్లో అన్ని రకాలు. ప్రేమగా చూడటం, క్రోధంగా చూడటం, అనుమానంగా చూడటం అంటూ రకరకాల చూపుల పేర్లున్నాయి. చూస్తున్నప్పుడు తనువు గగుర్పొడుస్తుందని, రోమాలు నిక్క పొడుచుకుంటాయని, శరీర అవయవాలలో రకరకాల వికారాలు కలుగుతాయని కవులు వర్ణిస్తూంటారు. అంత నిక్క పొడుచుకోక పోయినా శరీరంలో మార్పులు కలుగుతాయని మనమూ అంగీకరిస్తాం. భుజాలు అదరటం, రంగులు మారటం, మొహం యాపిల్ పండులా ఎర్రబడటం, ముక్కుపుటాలు అదరటం వాళ్ల వాళ్ల చూపుల అనుభవాల బట్టి ఆధారపడి ఉంటుంది.

కళ్లు తెరవగానే పట్టాభి మొదట చూసింది తల్లి మొహం కాదు; బాటిల్ నిపిల్. బిడ్డ ఫిగర్ కంటే తన ఫిగర్ ముఖ్యమని ఆమె నేచురల్ ఫీడ్ పట్ల నమ్మకం ప్రదర్శించలేదు. 'జో అచ్యుతానంద' అనే పాట పాడుతూ ఉయ్యాల ఊపేది. అమ్మపాటకో, ఉయ్యాల ఊపుకో అతడు సొమ్మసిల్లి పడుకుండిపోయేవాడు. పాల ధ్యాసే ఉండేది కాదు. అందుకేనేమో చిన్నప్పట్నుంచే పట్టాభి దేహంలో నట్లూ బోట్లూ తరుచు లూజవుతూండేవి. ఇప్పుడు మన దేశం పేద దేశం కాదు. వెనుకబడ్డ దేశం అంతకన్నా కాదు. పైగా 21వ శతాబ్దంలోకి పోతోంది. అందువల్ల తల్లులకు పాట పాడాల్సిన బెడద కూడా లేదు. బుగ్గ మీద చిటికేసి ఉయ్యాల తొట్టెలో పడుకొబెట్టి 'అమ్మనీ కమ్మనీ దెబ్బ' అనే క్యాసెట్ ఆన్ చేస్తే చాలు చిన్నారి బిందు లేస్తాడు. తల్లులు తమ ఫిగర్, టైం పాడు చేసుకోవాల్సిన అవసరం లేదు. పిల్లలకు పాలుకావాలి కానీ ఏ బూతు పాలయితే ఏం? ధరలు యిలానే పెరుగుతూంటే బూతుపాలు, డబ్బాపాలు ఎలానూ పట్టలేరు. పాల కథలు వీడియోలో చూపించి నిద్ర పుచ్చుతారు. వాళ్లు కళ్ళుతెరిచి ఎలాంటి బంగారు భవిష్యత్తు చూస్తారో యిప్పట్లో చెప్పలేం.

ఫాస్ట్ ఫుడ్ కు అలవాటు పడ్డ పట్టాభి వెరీ ఫాస్ట్‌గా ఎదిగి మూడో ఏటకే కాన్వెంట్ గడప తొక్కాడు. రైమ్స్ పుస్తకాలు, క్రయిం కథలు చదివి చకచకా ఎదిగిపోయాడు. కాన్వెంట్లలో పోర్షన్లు త్వరత్వరగా కవరయిపోతాయి.

పట్టాభికి పాఠాలు చెప్పే టీచరు ముందుగా లెసన్సు కవర్ చేసి ప్రిన్సిపాల్ మెప్పు పొందాలని ఆయన గదిలోకి వెళ్లింది. "సార్ నేనంతా కవర్ చేశానండీ అంటూ చీర సవరించుకుంటూ ప్రిన్సిపాల్‌తో అంది. ఆయన చిరునవ్వు నవ్వుతూ ఆమె కవర్ చేయని భాగాల వైపు అబగా చూశాడు. ఆమె తడబడుతూ చీర మరింత సర్దుకుంది. అయినా ఆయన చూపు తప్పించ లేదు. 'మీరు కవర్ చెయ్యండి. మేం చూస్తాం ఎంత వరకు కవర్ చెయ్యగలిగారో' అంటూ మళ్లీ విషపు నవ్వు నవ్వాడు. దాంతో టీచరు చర చరా బయటకు నడిచి వచ్చింది.

'మా వాడు పరీక్షలు రాయలేదు. మార్కులు తక్కువ వచ్చాయి' అంటూ పట్టాభి తల్లి టీచరుతో అంటే 'మీరు పిల్లవాణ్ణి సరిగా చూసుకోవాలి. ఒక్క పిల్లాణ్ణే మీరు చూసుకో లేక పోతే యింత మందిని మేమెలా చూస్తాం' అంటూ టీచరు ప్రిన్సిపాల్ పై ఉన్న కోపం పట్టాభి తల్లిపై ప్రదర్శించింది. అప్పట్నుంచి పట్టాభి తల్లి పిల్లవాణ్ణి చూసుకోవటం కంటే అతని టీచర్ని చూసుకోవటం చాలా ముఖ్యమని గ్రహించి పత్రం, పుష్పం లాంటివి గురుదక్షిణగా సమర్పించుకోవటం మొదలు పెట్టింది. టీచరు పరీక్షలో పట్టాభిని చూసుకుంది. అతడు మెట్టు మెట్టుగా పైకొచ్చాడు.

పిల్లవాడు ఎదిగి ఎంత కాలం అక్కరకు రాకపోయే సరికి పట్టాభి తండ్రి తన నియోజక వర్గం ఎమ్మెల్యేని చూశాడు. "లక్ష మందికి పైగా ఉండే నియోజక వర్గంలో ఎంత మంది బాగోగులని మేం చూస్తాం" అంటూ ఎమ్మెల్లే పెదవి విరిచే సరికి" అదేమిటి? ఎలక్షన్ల ముందు నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తాం' అని మీ పార్టీ వాళ్లు మేని ఫెస్టోలో చెప్పారుగా "అని పట్టాభి తండ్రి అడిగాడు. "మేనిఫెస్టోలో ఉన్నవన్నీ యిప్పుడే చూసేస్తే మళ్లీ ఎలక్షన్లకు యిక మేము చూసేందుకు ఏముంటుంది? చేసేందుకు ఏముంటుంది?" అన్నాడు నాయకుడు.

"నేను మిమ్మల్నే నమ్ముకు బ్రతుకుతున్నాను. మీరు గెలవటానికి ఎన్నో రోజులు నిద్రాహారాలు మాని ప్రచారం కోసం తిరిగాను. మీరు కాదంటే మా వాడి బతుకు బండలవుతుంది" అంటూ పట్టాభి తండ్రి ప్రాధేయ పడ్డాడు.

నాయకుడు తిరిగి అన్నాడు - "అయితే ఒక పని చెయ్యండి. మన ప్రాంతంలో కరువు విలయ తాండవం చేస్తోంది. ఆ కరాళ నృత్యం చూట్టానికి హైకమాండ్ ఇక్కడకు వస్తోంది. ఆ మీటింగు ఏర్పాట్లుమీరు చూడండి. మీ వాడి ఉద్యోగం సంగతి నేను చూస్తాను'


మీటింగుకు ఏర్పాట్లంటే లక్షలతోపని. అంత తాహతే ఉంటే పట్టాభికి ఎల్డీసీ ఏం ఖర్మ, క్లాస్ వన్ ఆఫీసరే వచ్చేది. ప్రజలు నాయకుణ్ణి చూసుకుంటేనే నాయకుడు ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకో గలుగుతాడు. లేక పోతే బతుకులు అనాధ బతుకులే.

మీసమున్నా లేక పోయినా, మొలతాడు ఉంటే చాలు, ఆడ పిల్లల తండ్రులు యింటి చుట్టూ తిరుగుతారు. మనిషి వ్యక్తి-త్వానికి కాకుండా మనిషి శరీర భాగాలకు రేటు ఫిక్స్‌చేయటం నిజంగా మన జాతి గర్వింపదగిన సంప్రదాయం. ఇంత మహోన్నత సంస్కృతిని వారసత్వంగా సంక్రమింప చేసుకుని మనవారు భావితరాల వారికి అందించాలని ఎంత తాపత్రయం పడుతూంటారో.

పెళ్లి అనేది ఆడపిల్లకు, మొగవాడికి అవసరమైన తతంగం. ఇందువల్ల యిరు పక్షాల వారు లాభపడతారు. ఎంతో కొంత

మగవాడే లాభపడతాడంటే కొంతమంది అభ్యంతరం చెప్పొచ్చు. కానీ పట్టాభి లాభ పడ్డాడంటే మాత్రం ఎవరికీ అభ్యంతరం ఉండటానికి వీల్లేదు. ఎందుకంటే పట్టాభి భార్య అతని కంటే రెండు ఆకులు ఎక్కువే చదువుకుంది. అతని కంటే మంచి ఉద్యోగం, జీతం సంపాయిస్తోంది. పైగా వచ్చేప్పుడు బోల్డు కట్నం పట్టుకొచ్చింది.

పిల్లని చూట్టానికని పట్టాభి, అతని తల్లి, అక్క యింకా యిద్దరు ముగ్గురు పెళ్లికి తరలి వెళ్లినట్టు వెళ్లారు. మంది మార్బలంతో సర్కస్ లో మార్చ్‌ఫాస్ట్ లా కొంప మీద పడటం వీళ్లు చూపులకు వస్తున్నారా, బంది





పోటు దొంగల్లా కాల్పులకు వస్తున్నారా అనే మీమాంసలో పడ్డారు. అల్పాహారం పేరుతో యిల్లుగుల్ల చేసిన తర్వాత పెళ్లిచూపులు ప్రారంభమయ్యాయి. రన్నింగురేస్‌లో ఫస్ట్ వచ్చిన పెళ్లికూతురు రమణి అడుగులో అడుగు వేసుకుంటూ గదిని మిల్లీ మీటర్లతో సహా కొలుస్తున్నట్టు వస్తూంటే పట్టాభి నరాలు పట్టు తప్పాయి. పాఠ్యపుస్తకాల్లో ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు కానీ పెళ్లి చూపులు ఎలా ఉండాలో అతడు నేర్చుకోలేదు. అది పాఠ్యాంశం కాదు. అది బోధించటం యిటు గురువులు అటు తల్లిదండ్రులు తమ కర్తవ్యంగా భావించరు.

రమణి వంచిన తల ఎత్తకుండా ముడు చుకు కూర్చునుంటే పట్టాభి అటుయిటు చూస్తు మధ్య మధ్యలో చూపుల తూపులు విసురుతున్నాడు. ఆ బాణాలకు రమణి మనస్సు ఎంతగా గాయపడిందో పెళ్లయిం తర్వాత కూడా అతడు ఎప్పుడూ అడిగి తెలుసుకోలేదు. పెళ్లి చూపులనే సంప్రదాయం మొదట్లో ఎలా ఉండేదో కానీ యిప్పుడు మాత్రం దుష్ట సంప్రదాయంగానే మారి పోయింది. వన్‌వే ట్రాఫిక్‌గా పెళ్లి కొడుకుకు చూసే అధికారం యిచ్చేస్తే అది సత్ సంప్ర దాయం ఎందు కవుతుంది.

పట్టాభి అక్కగారు రమణి జడపైకెత్తి అది వరిజినలా, డూప్లికేటా అని గొడ్డును పరీక్షిస్తున్నట్టు చూడటం రమణికి రంపపు కోతగా ఉన్నా ఎవరైనా చేసేది అదే కాబట్టి తమాయించుకుంది.

'అమ్మాయీ! ఒక్క పాట పాడు' అని రమణి అత్తగారు గరగరమనే బొంగురు గొంతుకతో అంటే యిలాంటి నీకు పెళ్లవగా లేంది నాకు ఆగిపోతుందాని రమణి అందామనుకుంది కానీ తల్లి ముందుగానే హెచ్చరించటం వల్ల ఆ ప్రయత్నం విరమించి శ్రావ్యంగా పాడింది. అందరూ చివరకు పిల్ల నచ్చిందన్నారు. అయినా రమణి దిగులు పడింది. తన జడ, తన పాట చూసి నచ్చింద నటం ఆమెకు తృప్తినివ్వలేదు. అయినా పెళ్లి ఆగలేదు. రమణి, పట్టాభి ఆలుమగల య్యారు. చూపుల పోస్టుమార్టంకు తట్టు కుంటేనే ఏ ఆడపిల్లకయినా పెళ్లయ్యేది.

అడుగులో అడుగు వేస్తు మొదటి రాత్రి రమణి గదిలోకి ప్రవేశించింది. పెళ్లి చూపుల నాడు పట్టాభి అంతా సవ్యంగానే చూడగలి




గాడు కానీ తలవంచుకుని కూర్చోవటం వల్ల రమణి మొహం సరిగా చూడలేక పోయాడు. ఇప్పుడైనా చూద్దాం అని ఆమె చుబుకం చూపుడు వేలుతో పైకెత్తాడు. న్యూటన్ 'థర్డ్‌లా ఆఫ్ మోషన్' ఆధారంగా తీసుకుని యాక్షన్ ప్రదర్శించి రమణి మరింత బరువుగా తల దించుకుంది. పట్టాభి మరింత బలంప్రదర్శించాడు. ఇహ లాభం లేదనుకుని రమణి భర్త పాదాలకు నమస్కరించి భారతీయ నారీ సంప్రదాయానికి జోహార్లంది. అప్పట్నుంచి పట్టాభి ఆమెను బాగా చూసుకోవటం ప్రారంభించాడు.

మర్నాడు భార్యభర్త లిద్దరూ మొదటి ఆట సినిమాకు వెళ్లారు. వెనుక సీటులో కూర్చున్న యాంగ్రీ యంగ్ మన్ 'గ్యాంగ్ లీడర్' చూస్తున్న ఉడుకు రక్తంతో రమణి దేహాన్ని కాలిగోటితో పదేపదే తాకుతూ ఎలా ఉందాని చూస్తున్నాడు. అతని వికృత చేష్టలకు తట్టుకోలేక రమణి పట్టాభికి వర్తమానం అందించింది. పట్టరాని కోపంతో పట్టాభి 'కాస్త మర్యాదగా కూర్చోండి' అంటూ గ్యాంగ్ లీడర్‌ని హెచ్చరించాడు. 'మేము సినిమా చూట్టానికి వచ్చాం. నీ నీతిచంద్రిక వినేందుకు రాలేదు' అంటూ గ్యాంగ్‌తో సహా యువకుడు పగలబడి నవ్వాడు. మొదటి రాత్రి కైపు యింకా దిగక, తన తాహత్తు తెలియక 'పోలీసు రిపోర్ట్ యిస్తాం' అని పట్టాభి బెదిరించాడు. 'అయితే బయటకి రాచూసుకుందాం' అని యువకుడు రెచ్చిపోయాడు. దాంతో పట్టాభి వంచిన తలెత్తకుండా సినిమా చూశాడు. రమణి అవమానంతో కృంగిపోయి ఇంటర్వేల్‌లో యింటికి వెళ్లిపోదామంది. గ్యాంగ్‌తో ఉంటే ప్రతివాడూ రౌడీనే. ఒంటరి వాడైతే ఎవరూ చిరంజీవి కాలేరు.

ఎంతో నమ్మకంగా పనిచేస్తున్నా సంవత్సరం తిరక్కముందే పట్టాభి ఉద్యోగం ఊడిపోయింది. అదేమయినా గవర్నమెంట్ ఉద్యోగమా ఎలా చేసుకు పోయినా రిటైరయ్యేంత వరకు ఉట్టి కట్టుకుని ఊరేగటానికి.

పై ఆఫీసర్ని యింటి కెళ్లి అడపాదడపా చూసుకోక పోతే ప్రయివేట్ కంపెనీలలో టెంపరరీ ఉద్యోగాలు ఊడిపోతాయి.

పట్టాభి తండ్రి నెత్తి నోరూ కొట్టుకున్నాడు. కొడుకు చేసిన నిర్వాకానికి చెడ పుట్టాడనుకున్నాడు ఇంత అర్భకుడు ఎలా పైకొస్తాడని దిగులు పడ్డాడు. చివరకు తనకు పరిచయమున్న ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి కాళ్లూ కడుపు పట్టుకున్నాడు. ఇది తనవల్ల అయ్యేపని కాదు, హైదరాబాదు వెళ్లాల్సిందే అని తీర్మానించాడు ఛోటా నాయకుడు. ఇద్దరూ కలిసి బడానాయకుడి దగ్గరకు వెళ్లారు. కానీ అక్కడ ఆ నాయకుని పరిస్థితి మరో విధంగా ఉంది.

బడా నాయకుడు చాలా దిగులుగా ఉన్నాడు. ప్రాంతంలో ఆకలి చావులనీ కాదు, కరువులనీ, వరదలనీ అంతకన్నా కాదు. అసమ్మతి పవనాలు వీస్తున్నా అతనెప్పుడూ ఖాతరు చెయ్యలేదు. ఇవన్నీ ప్రతి ప్రాంతంలో ఉండేవే. ఇందువల్ల నాయకత్వం మారదు. అయితే అతని దిగులుకి కారణం ఏమిటి?

ఓ వ్యక్తి కాల్చివెయ్యబడ్డాడు. అదీ పోలీసుల చేతుల్లో అని ప్రాంతమంతా గగ్గోలు పెడుతోంది. మానవ హక్కులను కాపాడే మనిషిని పొట్టన పెట్టుకోవటం దారుణమని మేధావులు ఖండిస్తున్నారు. బందులూ, హర్తాళ్ళు జరిగాయి. నిరాహారదీక్ష శిబిరాలు వెలిశాయి. ఇవన్నీ తరచు జరిగే తతంగాలే. అవి వారి వారి సంప్రదాయం అని సరి పెట్టుకోవచ్చు. బందు పేరుతో ఒకటి రెండు రోజులు ప్రభుత్వం స్తంభించిపోయినా తనకు వచ్చే నష్టమేమి లేదు. ఇహ నిరాహారదీక్ష లంటారా ఉపవాసం చేయటం మతపరమైన విషయం అని సరి పెట్టుకోవచ్చు. ముక్కోటి ఏకాదశికి, మహాశివరాత్రికి, నిరాహార దీక్ష చెయ్యటం లేదూ! అక్కడికీ తను పోయిన వ్యక్తికి నష్టపరిహారం ప్రకటించాడు. బిడ్డ పుట్టినప్పుడు, నా బంగారు కొండ, నా రత్నం అని ముద్దు చేసిన తల్లి ఆ బిడ్డ మరణానికి నష్ట పరిహారం క్రింద ఓ లక్ష ప్రకటిస్తే నా రత్నం విలువ పైసలా అని తల్లడిల్లిపోయింది. ఎంక్వైరి జరగాల్సిందే అని పట్టుబట్టింది. అదే బడానాయకునికి అసలు దిగులు.

నాయకుడు ఒంటరిగా గదిలో కూర్చుని ఎ.సీ రూములో కూడా చెమటలు కక్కుతున్నాడు. ప్రాంతం అరాచికంగా మారిందని, ప్రధాన నాయకుడు ఇక్కడికి వస్తాడు. ఏరు పోర్టులో దిగగానే బడానాయకుడు ఎక్కడ, అని అడుగుతాడు. తను ముఖం చాటేద్దామని ఎంత అనుకున్నా ఎదురు పడక తప్పదు. తనని చూడగానే ప్రధాన నాయకుడు బాహువులు చాపుతాడు. కౌగిలిలోకి రమ్మంటాడు. వన్, టూ, త్రీ ప్రధాన నాయకుడు తనని కౌగలించేసుకుంటాడు. అదే అతని ఆఖరి కౌగిలి. ఆ నాటితో తనకి ఉద్వాసన జరిగి పోతుంది. నాయకత్వం మారి పోతుంది. పై వాడు క్రిందవాణ్ణి అమిత ప్రేమగా చూస్తే యిలాంటి పరిణామాలు చవిచూడాల్సి వస్తుంది. ఆ విచారంతోనే నాయకుడు విజిటర్సుని చూడటం లేదు.

సంవత్సరం ఉద్యోగం చేయకుండానే పట్టాభి రిటైరయ్యాడు. యువకుడుగా ఉండగానే వృద్ధాప్యం పై బడింది. ఎంతసేపు చూసినా గడియారం ముల్లు కదలటం లేదు. పోనీ కాంపిటేటివ్ పరీక్షలకు చదువుకుందామన్నా ఆ వయస్సు కాదు. వ్రాత పరీక్షలో నెగ్గినా ఇంటర్వ్యూలో నెగ్గేంత దమ్ము లేదు.

ఉద్యోగం పోయిన మర్నాటి నుంచే అతని ప్రపంచం మారిపోయింది. అయిన వాళ్లు, కానీ వాళ్లు అతణ్ణి అదోరకంగా చూస్తున్నారు. బయటే కాదు, యింట్లోనూ తలెత్తుకు తిరగలేక పోతున్నాడు.

కాఫీ తాగందే పట్టాభికి తెల్లారినట్టు కాదు. పగటి కార్యక్రమాలు ఏవీ మొదలు కావు. కాఫీ తాగుతూ వార్తాపత్రిక తిరగేస్తూంటే ఆ తృప్తి వేరు. పతియే ప్రత్యక్ష దైవంగా భావించిన శ్రీమతి ఝాము పొద్దెక్కినా కాఫీ పట్టుకు రాకపోయే సరికి పట్టాభికి తన అస్థిత్వం ఓ సవాలుగా మారింది.

'కాస్త కాఫీ పట్టుకురా!' అంటూ పట్టాభి పంచమ స్వరంలో లోపలికి కేక పెట్టాడు.

"ఇప్పుడు మీకు తొందరేముందండీ? ఆఫీసుకు వెళ్లక్కర్లేదుగా! తీరుబడిగా తాగుదురుగానీ" అంటూ మధురంగా చివాట్లు పెట్టింది.

"పోనీ వార్త పత్రికన్నా పంపు" అంటూ మరో ప్రయత్నం చేశాడు.

**ఆల్ ఇండియా డిపాజిట్ మొబిలైజేషన్ స్కీమ్**

శ్రీరామ్ అంటేనే ఆర్థిక పరమైన సౌలభ్యం. భద్రత ఆర్థిక రాబడులు శ్రీరామ్‌లో నేడే చేరండి, భవిష్యత్తును మార్చుకోగల శక్తి పొందండి.

వినూత్న డిపాజిట్‌ల పథకం వివరములకు :

GROUP COMPANIES MADRAS

**శ్రీరామ్ చిట్స్ ప్రై. లిమిటెడ్,**
**రాజగోపాలచారీ వీధి,**
**గవర్నరు పేట**
**విజయవాడ - 520 002**


"మీ నాన్నగారు చదువుతున్నారు. ఇంట్లో కూర్చునే వారికి దేశంలో వార్తలు తెలియక పోయినా కొంపేమీ మునిగిపోదు. అనవసరంగా గొంతు చించుకుంటూ గావు కేకలు పెట్టకండి. నాకు చచ్చేంత పనుంది. ఆఫీసుకు వెళ్లాలి" అప్పటితో పట్టాభి ఆ ఆశ వదులుకున్నాడు.

"తమ్ముడూ! రింకూ సరిగా చదవటం లేదని ప్రిన్సిపాల్ కబురు పంపాడు. నాకు మీటింగు ఉంది. నువ్వు వెళ్లి కలిసిరా" అంటూ ఆఫీసుకు పోతూ పోతూ అన్నగారు పురామాయించారు.

ప్రిన్సిపాల్ పట్టాభిని చూసి పిల్లవాడి తండ్రి అనుకుని ముందు ఎడా పెడా వాగ్బాణాలతో వాయించాడు. ఆ తర్వాత సావధానంగా పట్టాభి అసలు పొజిషను అర్థం చేసుకుని 'అయితే ఇంకేం? ఎలానూ మీరు ఖాళీగా ఉన్నారు కాబట్టి పిల్ల వాడికి యింట్లో పాఠాలు నూరి పొయ్యండి" అంటూ సలహా యిచ్చాడు. ఆ నాటినుంచి బడి పంతులుగా పట్టాభి ఖాయమయ్యాడు.

"ఇంట్లో ఖాళీగా కూర్చుంటే ఏం తోస్తుంది, అలా బయటకు వెళ్లి కరెంటు బిల్లు కట్టరాదూ" అంటూ తల్లి కరెంటు బుక్ చేతికిచ్చింది. ఆఫీసుకు బయలు దేరుతూండగా "పట్టాభి గారూ! మా వారు చాలా బిజీగా ఉండి రెండు నెలలుగా కరెంట్ బిల్ కట్టలేదు. ఈ రోజు ప్యూజు పీక్కుపోతామన్నారు. కాస్త సాయం చెయ్యరూ!" ఆ రోజంతా కాళ్లు పీక్కు పోయేట్టు క్యూలో నిలబడి కార్యం అయిందనిపించాడు.

ఆ వాడకట్టులో పరంధామయ్యగారి పేరు తెలియని వాళ్లుండరు. అడుగు బద్దంత నోరు పెట్టుకుని మాట్లాడటం మొదలు పెట్టాడంటే ఒక పట్టాన వదలడు. ఆయన ఎదురు పడితే చాలు ఏదో పనుందని చెప్పి తప్పించుకుంటారు.

పట్టాభి పనీ పాట లేక యింట్లో ఖాళీగా ఉంటున్నాడని పరంధామయ్య పసి కట్టాడు. 'అలా పార్కుకు వెళదాం రావోయ్! అంటూ ఆహ్వానించాడు. ఇంతకు మునపయితే ఆఫీసు వుందండి అంటూ తప్పించుకునే వాడేమో కానీ యిప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. సరే తప్పుతుందా అనుకుని బయలు దేరాడు.

"చూడు పట్టాభీ! సుఖం అనేది అందరి సొత్తు కాదు. హాయిగా కాలుమీద కాలేసుకుని తింటూ కూర్చునే దంతసిరి అందరికి పట్టద్దూ. నాకు పట్టిందాంటే రిటైరయ్యింతర్వాత. ఇప్పుడు తిందామన్నా దంతాలు లేకుండా పోయాయి. నీకు యివి సువర్ణావకాశం అనుకో. భార్య సంపాయిస్తోంది. తండ్రి యింకా రిటైర్డ్ కాలేదు. ఇహ నీకు దిగులేంటి' ' అంటూ వాణిజ్య కేంద్రంలా ట్రిగ్ ట్రింగ్ అనే గ్యాప్ లేకుండా చెప్పుకుంటూ పోతూంటే ఆ మాటల్లోని ఆంతర్యం పట్టాభికి అర్థమయినట్టు పరంధామయ్యగారి క్కూడా అర్థమయి ఉండదు. నిరుద్యోగి బ్రతుకు కంటే నికృష్టంగా ఉంటుంది, ఉద్యోగం ఊడిన వాడి లైఫ్. ఎమైనా సరే అందరి చేత యిలా చులకనగా చూడపడకూడదని నిశ్చయించు కున్నాడు.

ఆ రాత్రంతా పట్టాభికి నిద్ర పట్టలేదు. "ఏమండీ! ఆఫీసు టైం అయింది కాస్త జడ వెయ్యరూ! ఏమండీ! ఈ రోజు సాయంత్రం మా ఫ్రండ్సుతో సినిమాకు వెళ్లాలి, మీరు అడ్వాన్సు బుక్కింగు తేరూ! ఏమండీ! యిస్త్రీ వాడు ఈ రోజు రాలేదు. చీర ఐరన్ చేసి పెట్టరూ!'' అంటూ రమణి పనులు పురమాయిస్తున్నట్టు ఉలిక్కి పడ్డాడు.

"బాబాయీ! పాఠం చెప్పవూ!" అంటూ అన్న కొడుకు, "పట్టాభిగారు! మా వారు లేరు. మీరు సాయం చెయ్యరూ!" అంటూ పక్కింటి కామాక్షి "తమ్ముడూ! కాస్త బూట్ పాలిష్ చెయ్యరా! మురికిగా ఉన్నాయి" అంటూ అన్నగారు "నాయనా! నీ కంటే రమణే నయం కదరా!" అంటూ అమ్మ "పట్టాభీ! నేను వాలంటరీ రిటైర్ మెంట్‌కు అప్లయి చేస్తా. నిన్ను యిలా చూస్తూ ఉండలేనురా!" అంటూ తండ్రీ యిలా యింటా బయటా రకరకాల జనం తనని పీక్కుని తింటున్నట్టు, తనకు పిచ్చి పట్టేట్టు పట్టాభి ఫీలయ్యాడు. ఇందరూ తనని 'నడు పీనుగు వచ్చుననుచు' నవ్వుతున్నారని బాధపడ్డాడు. ఆ చూపులను అతడు తట్టుకోలేక పోయాడు.

మర్నాడు పట్టాభిని చూసిన వారంతా ముక్కుమీద వేలేసుకున్నారు. ఆటో డ్రైవర్ సీటులో పట్టాభిషిక్తుడయిన పట్టాభిని నిరుద్యోగులు సయితం ఆదర్శప్రాయుడుగా చూశారు.

☆